క్లుప్తంగా

రేపు ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఫిరంగిపురం: అమీనాబాద్ కొండపై కొలువై ఉన్న మూలాంకురేశ్వరి ఆలయంలో ఈ నెల 27న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ట, ఆలయ గోపురానికి మరమ్మతులు, దేవస్థానం పైకప్పు, ఫ్లోరింగ్, గర్భాలయం, అంతరాలయం, మెట్లు, కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం, నీటి సరఫరా విభాగాలు వంటి పలు పనులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆటల పోటీల్లో సత్తా చాటిన కోటేశ్వర్



తాడేపల్లిరూరల్: ఉండవల్లిలో నివాసముండే ఓ బుడతడు ఆటల పోటీల్లో సత్తా చాటి శభాష్ అనిపించుకున్నాడు. బుధవారం ఆ బుడతడిని పలువురు అభినందించారు. ఉండవల్లి సెంటర్ వంశీ టాలెంట్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న సందు కోటేశ్వర్ ఈ నెల 24వ తేదీ గుంటూరు బ్రహ్మనందరెడ్డి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన అండర్–11 డిస్ట్రిక్ట్ లెవల్ పోటీల్లో పతకాలు సాధించాడు. డోర్–1 (1500 మీటర్లు), అండర్–11 డిస్ట్రిక్స్ లెవల్ విభాగంలో బంగారు పతకం, రింక్–1 (500 మీటర్లు) అండర్–11 డిస్ట్రిక్ట్ లెవల్ విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. గేమ్స్‌లో కోటేశ్వర్ ప్రతిభ చాటడంతో స్కూల్ యాజమాన్యం అభినందించింది.

దళిత యువకులను చితకబాదిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి



మంగళగిరి: దళిత యువకులను చితకబాదిన మంగళగిరి రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘ నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని ఐబీఎస్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఏడాది డిసెంబరు 31వ తేదీ రాత్రి మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నిడమర్రులో రావిచెట్టు సెంటర్ వద్ద నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న దళిత యువకులపై కేసు పెట్టి చిత్ర హింసలకు గురిచేసిన ఎస్‌ఐ విజయ్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో దళిత నాయకులు పచ్చల శ్యామ్‌బాబు, ఈపూరి ఆదామ్, మల్లవరపు సుధారాణి, కట్టెపోగు బాబూరావు, కొదమల కుమార్, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌సీఎం చర్చి 26వ ప్రతిష్టా వార్షికోత్సవం



కంతేరు(తాడికొండ): కంతేరు గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి 26వ ప్రతిష్టా వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొనగా చర్చి పెద్దలు ఘనంగా సత్కరించారు. ప్రతిష్టా మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఫాదర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు సందేశం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జం మహేష్ బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ మారా శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ నంద్యాల సదానందరెడ్డి, కర్రి రవిపాల్, రూబేస్ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో స్వేచ్ఛ ఫ్రీడం ఫెస్ట్



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో బుధవారం స్వేచ్ఛ ఫ్రీడం ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశ్వవిద్యాలయ ఆచార్యులు కె.శ్రీపతిరాయ్ మాట్లాడుతూ మనిషి జీవించడంలో కాదు టెక్నాలజీ వాడే విషయంలో కూడా స్వేచ్ఛ కలిగిఉండాలని సూచించారు. సాఫ్ట్‌వేర్ల వినియోగంలో లైసెన్స్‌ల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడం సరికాదన్నారు. ఈ సదస్సుకు సుమారు 700 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో పలు రకాల ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న స్వేచ్ఛ వలంటీర్లు, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, స్వేచ్ఛ ప్రతినిధులు నిహారిక, సాయితేజ, మానస, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమ పూర్వ వైభవానికి సీఎం జగన్ కృషి

- రూ.2.40 కోట్లతో 120 మగ్గం షెడ్లు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



రాజీవ్ గృహకల్పలో మగ్గాల షెడ్ల నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: చేనేత పరిశ్రమకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప ఆవరణలో రూ.2.40 కోట్లతో చేపట్టిన మగ్గాల షెడ్ల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోదీ సౌజన్యంతో నేషనల్ కాంప్రహెన్సివ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ స్కీమ్ కింద రూ.1.10 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.30 కోట్లతో కలిపి రూ.2.40 కోట్ల నిధులతో నగరంలోని రాజీవ్ గృహకల్ప ఆవరణలో 120 మగ్గాల షెడ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. చేనేత కార్మికులకు పూర్తిస్థాయిలో అండగా ఉండాలని, చేనేత పరిశ్రమకు తిరిగి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆనాటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కృషితో రాజీవ్ గృహకల్ప సముదాయాన్ని నిర్మించడంతో పాటు చేనేత మగ్గాలు కూడా ఏర్పాటు చేయాలని భావించారని గుర్తుచేశారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేసినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత పరిశ్రమ అభివృద్ధి కుంటుపడిందని, ఈ నేపథ్యంలో రాజీవ్ గృహకల్పలో నివసించే పేద చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు రానున్న మూడు నెలల్లో మగ్గాల షెడ్ల ఏర్పాటును పూర్తి చేస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయాల వద్ద చేనేత మగ్గాలను ఏర్పాటు చేసి కార్మికులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ యు.శారదాదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మించొద్దంటూ వినతిపత్రం అందజేత



తహసీల్దార్ మల్లేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపే సెల్ టవర్‌ను చిలువూరులోని ప్రభుత్వ పాఠశాల పక్కన నిర్మించవద్దంటూ బుధవారం దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరికి అంబేడ్కర్ వైజ్ఞానిక విప్లవ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు, న్యాయవాది నాగరాజు మాట్లాడుతూ చిలువూరులోని ప్రభుత్వ పాఠశాల పక్కనే సెల్ టవర్ నిర్మిస్తున్నారని, సెల్ టవర్ నుంచి విడుదలయ్యే హై ఫ్రీక్వెన్సీ రేడియోధార్మిక, విద్యుదయస్కాంత కిరణాల వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 150 మందితో సంతకాలు చేయించి స్థానిక పంచాయతీ సెక్రటరీకి అందజేశామని తెలిపారు. వెంటనే సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపకపోతే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్వర్ణలత, ఝాన్సీ, సంపూర్ణ, విక్టోరియా, చంద్రమోహన్, కోటేశ్వరరావు, సులోచన, మాధుసూదనరావు, మరియమ్మ, కమల, నారాయణ, విక్టోరియా రాణి తదితరులు ఉన్నారు.

బాలికలకు ఆత్మస్థైర్యమే అసలైన బలం

ఎన్‌సీసీ 22వ బెటాలియన్ లెఫ్టినెంట్ అధికారి మౌనిక



ఆత్మరక్షణపై శిక్షణ ఇస్తున్న కేఎల్‌యూ శిక్షకుడు మధుసూదనరావు

తాడేపల్లిరూరల్: బాలికలకు ఆత్మస్థైర్యమే అసలైన బలం అని కేఎల్ విశ్వవిద్యాలయ ఎన్‌సీసీ 22వ బెటాలియన్ లెఫ్టినెంట్ అధికారి మౌనిక అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలోని ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు కేఎల్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ బాలికలు ఆత్మస్థైర్యాన్ని వీడకూడదన్నారు. ముందుగా 8, 9, 10 తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. చిత్రలేఖనం పోటీల్లో 9వ తరగతి చదువుతున్న సరిగల శిరీష ప్రథమ బహుమతి సాధించగా, ద్వితీయ బహుమతిని 8వ తరగతి చదువుతున్న ప్రణీత దక్కించుకుంది. 9వ తరగతి చదువుతున్న కె.విల్సన్ బాబు తృతీయ స్థానంలో నిలిచింది. అనంతరం ఆమె బాలికలకు ఆత్మరక్షణపై ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. విశ్వవిద్యాలయానికి చెందిన శిక్షకులు పి.మధుసూదనరావు బాలికలు తమను తాము ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన వారికి విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ చేతుల మీదుగా గురువారం బహుమతులు అందజేస్తామని మౌనిక తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, చిత్రలేఖనం ఉపాధ్యాయులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నాగార్జున హైస్కూల్ రజతోత్సవం



డ్యాన్స్ ప్రదర్శన నిర్వహిస్తున్న బాలికలు

గుంటూరు: విద్యార్థులకు సంస్కారం, వినయ విధేయతలతో కూడిన విద్యనందించడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడిలోని నాగార్జున హైస్కూల్ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి జరుగుతున్న కార్యక్రమాల్లో విద్యార్థులు, దేశభక్తి గీతాలు, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. పదో తరగతి విద్యార్థుల పిరమిడ్ ప్రదర్శన ఈ వేడుకల్లో హైలెట్‌గా నిలిచింది. బుధవారం నాటి కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. చిన్నారులకు క్రమశిక్షణ అలవర్చుతున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారుల ప్రదర్శనలు తిలకించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తాడేపల్లిరూరల్: జాతీయ రహదారి వెంబడి గుట్టుచప్పుడు కాకుండా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న వ్యక్తిని తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ బుధవారం అదుపులోకి తీసుకుని అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ కృష్ణలంకకు చెందిన వెల్లంకి రామకృష్ణ బైపాస్ రోడ్డులోని జాతీయ రహదారి వెంబడి కుంచనపల్లి వద్ద మద్యం అమ్ముతున్నాడని పోలీసులకు సమాచారం అందడంతో అక్కడకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. వెల్లంకి రామకృష్ణ వద్ద 43 క్వార్టర్ బాటిళ్లు లభించాయి. అక్రమ మద్యం కలిగి ఉన్నందుకు ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం రామకృష్ణపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎయిమ్స్ ఆసుపత్రిలో ద్విచక్ర వాహనం మాయం

మంగళగిరి: ఎయిమ్స్ ఆసుపత్రిలో ఓ ద్విచక్ర వాహనం మాయమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన కె.శ్రీనివాసరావు మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో మందులు తీసుకునేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చి వాహనాన్ని పార్క్ చేశాడు. అనంతరం ఆసుపత్రిలోని మందుల దుకాణానికి వెళ్లి మందులు కొనుగోలు చేసి తిరిగి వచ్చే సరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో తన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు గుర్తించి మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శ్రీనివాసరావు తెలిపారు.

ఎస్‌ఆర్‌ఎంలో మెగా రక్తదాన శిబిరం



వైద్య శిబిరంలో రవాణాశాఖ డీసీ షేక్ కరీం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి

మంగళగిరి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్, మెడికల్ స్టూడెంట్స్ అఫైర్స్ విభాగాలు రక్తదాన శిబిరాన్ని నిర్వహించాయి. గుంటూరు రవాణాశాఖ డెప్యూటీ కమిషనర్ షేక్ కరీం, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి ముఖ్యఅతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా అధ్యక్షతన జరిగిన సభలో డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన ఉద్యోగులు, విద్యార్థులు అభినందనీయులన్నారు. కార్యక్రమం నిర్వహణకు సంపూర్ణ సహకారం అందించిన ఏపీ ఎస్ఆర్ఎం పనితీరు ప్రశంసనీయమని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎన్.ప్రభావతి కొనియాడారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మనోజ్‌కుమార్ అరోరాను దుశ్శాలువా కప్పి సత్కరించి మెమొంటోను ప్రదానం చేశారు. రక్తదాన శిబిరంలో మొత్తం 220 మంది రక్తదానం చేశారని, ఇందులో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషమని యూనివర్సిటీ మెడికల్ అధికారి డాక్టర్ సీహెచ్ లక్ష్మీరాజ్యం పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొ వైస్ చాన్సలర్ ఆచార్య డి.నారాయణరావు, రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్ కుమార్, డైరెక్టర్లు మనీష్‌కుమార్, అనూప్‌సింగ్, సూర్యవంశీ, అనిలి నిగమ్, రేవతి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

- సామాజిక మాధ్యమాల్లో ప్రచారంతో ఫలించిన కృషి
- వృద్ధురాలిని కుమార్తెకు అప్పగించిన పోలీసులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలో నివాసముండే 70 సంవత్సరాల వృద్ధురాలు కనిపించడం లేదంటూ ఆమె కుమార్తె షాకీరా బుధవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ నారాయణ వృద్ధురాలు కరీమున్నీసా మతిస్థిమితం లేక, ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని ఎవరైనా గుర్తిస్తే తాడేపల్లి పోలీసులకు తెలియజేయాలంటూ మంగళగిరి, పెదకాకాని, విజయవాడ తదితర పోలీస్‌స్టేషన్‌లతో పాటు సచివాలయ సిబ్బందికి, తాడేపల్లిలో పనిచేస్తున్న పోలీసులందరికీ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. సాయంత్రం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సురేష్ గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మంగళగిరి ఎన్ఆర్‌ఐ జంక్షన్ వద్ద ఆ వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్లడం గమనించి ఆమెను తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చారు. ఆమెను కుమార్తెకు అప్పగించారు. ఎస్‌ఐ నారాయణ చాకచక్యంగా వ్యవహరించినందుకు ఉన్నతాధికారులు ఆయనను అభినందించారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు ఫరీనాబేగం

ఫిరంగిపురం: పోషకాహారం తీసుకోవడం ద్వారా చిన్నారుల్లో రక్తహీనత సమస్యలు తొలగిపోతాయని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఫరీనాబేగం అన్నారు. వేములూరిపాడు సచివాలయం వద్ద బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా 104 వాహనంతో వైద్య శిబిరం నిర్వహించారు. 110 మందికి పలు రకాల పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు అందజేశారు. మధ్యాహ్నం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పిల్లలకు బరువు, ఎత్తు పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించి వారికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా పిల్లల తల్లులకు రక్తహీనత తొలగేందుకు పాటించవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో 104 వైద్యాధికారి మేడా రవికుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ మిత్ర పాట ఆవిష్కరణ



ఆడియో విడుదల చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో హరేంద్ర ప్రసాద్

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై రాసిన పాటను బుధవారం మంగళగిరిలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో హరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ మిత్రల పనితీరును పాట రూపంలో రూపొందించడం చాలా సంతోషంగా ఉందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరోగ్యశ్రీ పథకానికి ఆరోగ్య మిత్రలు మరింత అంకితభావంతో పనిచేసి ఇంకా మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఆరోగ్యమిత్రలపై ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 'పథకానికి సారథి ఆరోగ్యమిత్ర' పాటను రూపొందించడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర రాష్ట్ర సంఘం అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ కలామ్ అజాద్, రాష్ట్ర సంఘం ప్రధాన సలహాదారు శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

భావితరాల భవిష్యత్తుకు ఓటు ఆయుధం



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అడిషనల్ కమిషనర్ హేమమాలిని



ప్రతిజ్ఞ చేస్తున్న బీఎల్‌ఓలు, ఓటర్లు



మాట్లాడుతున్న తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు

అడిషనల్ కమిషనర్ హేమమాలిని

మంగళగిరి: భావితరాల భవిష్యత్తుకు ఓటే వజ్రాయుధమని, ఒక్క ఓటుతో తలరాత మారుతుందని అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు అన్నారు. 72వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం వద్ద నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ హేమమాలిని మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఓటు విలువను తెలియజేసేందుకే ప్రజలకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తాడేపల్లిరూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్ వద్ద బీఎల్ఓల ఆధ్వర్యంలో బుధవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఉండవల్లిలో డెప్యూటీ తహసీల్దార్ రమణరాజు మాట్లాడుతూ 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కొత్తగా ఓటు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరితో తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతంలోని 40 పోలింగ్ బూత్‌లలో ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఓటర్లలో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వం, ఎన్నికల సంఘం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రశాంతి, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, వీఆర్ఏలు, ఓటర్లు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో తహసీల్దార్ పద్మనాభుడు

దుగ్గిరాల మండలంలో..

తాడేపల్లిరూరల్: ప్రజలతో ప్రజల కోసం ప్రజలే పాలకుల్ని ఎన్నుకునేది ప్రజాస్వామ్యమని, అది ఓటు హక్కు ద్వారానే సాధ్యమని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి అన్నారు. బుధవారం దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద జరిగిన జాతీయ ఓటరు దినోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలు పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌వోలకు సన్మానం చేసి, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, వీఆర్‌వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు కావడం ప్రతి ఒక్కరి బాధ్యత

తాడికొండ: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడం బాధ్యతగా భావించాలని తాడికొండ తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండ బీఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు సునీతలక్ష్మి, ఎస్.మేరీసువర్ణలత, అధ్యాపకులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

బీఎస్ఎస్‌బీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో ప్రిన్సిపాల్ ఎస్.మేరీసువర్ణలత విద్యార్థులకు ఓటు హక్కు– ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకురాలు ఆర్.నాగమణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏవీ రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

ఫిరంగిపురం: తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పద్మనాభుడు మాట్లాడుతూ 1956 జనవరి 25న ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. తరువాత దానినే 2010న జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రకటించారని, అప్పటి నుంచి ఏటా జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, రంగవల్లుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.అనూరాధ, ఎంఈవో సాల్మన్‌రాజు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఓటర్ల నమోదులో ఏపీ ఎస్‌ఆర్‌ఎం ఫస్ట్

ప్రశంసాపత్రాన్ని అందజేసిన కలెక్టర్, ఐజీ



మంగళగిరి: నూతన ఓటర్లుగా ఎక్కువ మందిని నమోదు చేసిన ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు. ఉత్తమ నూతన ఓటర్ల నమోదు విద్యా సంస్థగా ఎంపిక చేసి ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం గుంటూరు కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ త్రివిక్రమ వర్మ, జాయింట్ కలెక్టర్ రాజకుమారితో కలసి యూనివర్సిటీ స్టూడెంట్స్ అఫైర్స్ డైరెక్టర్ అనిల్ నిగముకు ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికను ప్రదానం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సమర్థవంతమైన నాయకులను ఎన్నుకునేందుకు ఓటు వజ్రాయుధమని, దీన్ని సద్వినియోగం చేసుకునేందుకు యువత ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎక్కువ మంది యువతను ఓటర్లుగా నమోదు చేసే విషయంలో రెవెన్యూ యంత్రాంగానికి సహకారం అందించిన యూనివర్సిటీ యాజమాన్యాన్ని ఐజీ త్రివిక్రమవర్మ అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com